
అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 87 | శనివారం 27 జూన్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

# వెలిగొండ ద్వారా ఈ సీజన్‌కే నీళ్లు ఇస్తాం


దీని ద్వారా 4 జిల్లాల ప్రజలకు మారనున్న తలరాతలు

నిర్వాసితులకూ న్యాయం చేస్తాం

2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్ల పరిహారం పంపిణీ


ప్రాజెక్టుపై గత పాలకులది డ్రామా

మంత్రి నిమ్మలతో కలిసి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు



**(అంకుశం, మార్కాపురం, జూన్ 27):**

వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్--1 ద్వారా ఈ సీజన్ లో నీళ్లను అందిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సీఎం చంద్రబాబు శనివారం మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని గంటవానిపల్లెలో వెలిగొండ ప్రాజెక్టు పనుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఫేజ్--1 కింద 1.19 లక్షల ఎకరాలకు నీళ్లు, 4 లక్షల మందికి తాగునీరు అందిస్తాం. ఫేజ్--2 కింద 3.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని.. అలాగే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని.. ఇందుకు తనది గ్యారెంటీ ఆంటూ ముఖ్యమంత్రి ప్రకటించారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 2,351 మంది నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ  నిమిత్తం రూ.300 కోట్ల విలువైన చెక్కును ముఖ్యమంత్రి అందించారు. ప్రాజెక్టు పరిధిలోని రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు చరిత్ర... మార్కాపురం జిల్లా - మిగతా2లో





# ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై పరిమితులు

- ముందుకు 3 అడుగులు
  చుట్టూ ఒక అడుగే
- ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- ఇళ్ల స్లాబు 500 నుంచి 750 చదరపు అడుగులు మాత్రమే ఉండాలని జీవో
- లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని గుర్తించిన గృహ నిర్మాణ సంస్థ
- ఉత్తర్వులు జారీ చేసిన గృహనిర్మాణ శాఖ కార్యదర్శి



హైదరాబాద్

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వ్యయం లబ్ధిదారులకు భారంగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల స్లాబ్ పరిమాణంపై పరిమితులు విధిస్తూ శనివారం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. పేద లబ్ధిదారులు అనవసరపు ఖర్చులతో అప్పుల పాలు కాకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ విస్తీర్ణంపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇందిరమ్మ ఇళ్ల స్లాబు 750 చదరపు అడుగులకు మించరాదని గృహ నిర్మాణ శాఖ స్పష్టం చేసింది. ముందు వైపు 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే ముందుకు రావాలని తెలిపింది. ఇంట్లోకి ఎండ, వర్షం రాకుండా అవసరమైతే సజ్జలు - మిగతా3లో

# ముత్యపు కవచంలో భక్తులను మురిపించిన మలయప్పస్వామి...

**అంకుశం న్యూస్ తిరుమల జూన్ 27**



తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకంలో భాగంగా రెండో రోజు శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ముత్యపు కవచం ధరించి నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను మురిపించారు. అంతకుముందు ఉదయం 6.30 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు ఉభయనాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఉదయం 8 గంటలకు ఆలయ అర్చకులు మరియు వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీ మలయప్ప స్వామివారికి, దేవేరులకు అభిదేయక అభిషేకాన్ని కన్నులపండుగగా చేపట్టారు. సాయంత్రం శ్రీ మలయప్పస్వామివారికి ముత్యపు కవచ సమర్పణ వేడుకగా జరిగింది. అనంతరం సహస్రదీపాలంకార సేవలో  స్వామి ముత్యపు కవచంలో భక్తులను అనుగ్రహించారు. కాగా సంవత్సరంలో ఒకమారు మాత్రమే ముత్యపు కవచాన్ని ధరించిన స్వామివారి ముగ్ధమనోహర రూపాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, శ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ , అదనపు ఈవో  సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డెప్యూటీ ఈవో  లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



## అయోధ్యలో నిధులు దుర్వినియోగంపై చంద్రబాబు నోరు విప్పాలి

### పవన్ కళ్యాణ్ అయోధ్యకు పాదయాత్ర చేయాలి

### సీపీఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్

**(అంకుశం, మార్కాపురం, జూన్ 27):**



అయోధ్యలో వందల కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నోరు విప్పాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు, భక్తుల మనోభావాలను కాపాడేందుకు పవన్ కళ్యాణ్ అమరావతి టు అయోధ్య పాదయాత్ర చేయాలని సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి లడ్డులో కల్తీ జరిగిందని, తద్వారా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు దాదాపు మూడు మాసాల పాటు ఎక్కడికి వెళ్ళినా అదే విషయాన్ని ప్రస్తావించారు. చివరికి క్యాబినెట్లో కూడా దాని గురించి మాట్లాడారు. పార్టీ సమావేశాల్లోనూ మీడియాతో కూడా మాట్లాడారు. పవన్ కళ్యాణ్ మరో అడుగు ముందుకేసి లడ్డు కల్తీ అంశంలో తిరుమలకు పాదయాత్ర కూడా చేశారు. ఇప్పుడు అయోధ్యలో ప్రజల, భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా అక్కడివారు వందల కోట్ల రూపాయల నిధులు సొంతానికి వాడుకున్నారని, దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట్లాడాలని డిమాండ్ చేశారు.

## విశాఖ సీపీని కలిసిన రాధాగాయత్రి తల్లిదండ్రులు

### -- మృతిపై అనుమానాలు ఉన్నాయని వెల్లడి

**(అంకుశం, విశాఖపట్నం, జూన్ 27):**

హనీమూన్ కోసం వెళ్లి మసూరీలో ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన టెకీ రాధాగాయత్రి తల్లిదండ్రులు శనివారం విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిశారు. రాధాగాయత్రి మృతికి సంబంధించి ఆమె భర్త శ్రీచరణ్‌పై అనుమానాలు ఉన్నాయని, కేసు విచారణ వేగవంతం చేయాలని వారు సీపీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం గాయత్రి తల్లి సత్యవతి మీడియాతో మాట్లాడుతూ.. నిందితుడు శ్రీచరణ్‌కు శిక్షపడాలని డిమాండ్ చేశారు.



# చిరకాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసే చర్చల కోసం ఎదురుచూస్తున్నాను



ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన (జూన్ 27–29) నిమిత్తం శనివారం సీషెల్స్‌కు బయలుదేరారు. ఈ పర్యటనలో ఆయన సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు హాజరుకానున్నారు. అలాగే సీషెల్స్‌తో భారత్ స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆ దేశ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈ నేపథ్యంలో సీషెల్స్ బయలుదేరే ముందు మోదీ ప్రకటన విడుదల చేశారు. భారత్‌కు సీషెల్స్ ఒక విలువైన సముద్ర పొరుగు దేశమని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'విజన్ మహాసాగర్', గ్లోబల్ సౌత్ పట్ల భారత్‌కు ఉన్న ఉమ్మడి నిబద్ధతలో సీషెల్స్ ఒక కీలక భాగస్వామి అని తెలిపారు. సీషెల్స్‌తో చిరకాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జరగనున్న ద్వైపాక్షిక చర్చల కోసం తాను ఎదురుచూస్తున్నానని వెల్లడించారు. పరస్పర విశ్వాసం, గౌరవం, ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలతో పాతుకుపోయిన భారత్–సీషెల్స్ దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదికి 50 ఏళ్లు పూర్తవుతున్నాయని అన్నారు. "హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రత, శ్రేయస్సును పెంపొందించడానికి భారత్, సీషెల్స్ కలిసికట్టుగా కృషి చేస్తాయి. సీషెల్స్ అధ్యక్షుడు హెర్మిని ఆహ్వానం మేరకు జూన్ 27–29 తేదీల మధ్య ఆ దేశంలో పర్యటిస్తున్నాను. ఈ సందర్భంగా సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకల్లో గౌరవ అతిథిగా పాల్గొంటాను. ఈ చారిత్రక అవకాశం రెండు దేశాలను కలిపి ఉంచే బలమైన ప్రజాస్వామ్య విలువలను, పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో సీషెల్స్ అధ్యక్షుడు హెర్మిని భారత్ పర్యటన స్ఫూర్తితో ఇరు దేశాల చిరకాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జరగబోయే చర్చల కోసం ఎదురుచూస్తున్నాను."

**ప్రవాస భారతీయులను కలవడం కోసం ఎదురుచూస్తున్నాను : మోదీ**

రెండు దేశాల మధ్య సజీవ వారధిగా నిలుస్తున్న సీషెల్స్‌లోని చైతన్యవంతమైన ప్రవాస భారతీయులతో మమేకమవ్వడానికి తాను ఎదురుచూస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "నా పర్యటన ఇరు దేశాల మధ్య ఉన్న చిరకాల బంధాలను మరింత బలోపేతం చేస్తుంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర సహకారాన్ని పెంపొందిస్తుంది. సురక్షితమైన, శాంతియుతమైన, సుసంపన్నమైన హిందూ మహాసముద్ర ప్రాంతం అనే మన ఉమ్మడి ఆశయాన్ని ముందుకు తీసుకెళ్తుంది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో చర్చలు జరపడానికి ఎదురుచూస్తున్నాను. రెండు దేశాలు దౌత్య సంబంధాలు 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో నేను సీషెల్స్‌లో పర్యటిస్తున్నాను. ఈ పర్యటన సందర్భంగా సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించే తొలి భారత ప్రధానిగా నిలిచే గౌరవం నాకు దక్కనుంది. " అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**మోదీకి స్వాగతం పలుకుతూ పోస్టర్లు**

మరోవైపు తమ దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించనున్న నేపథ్యంలో విక్టోరియా–మహే ప్రాంతంలో సందడి నెలకొంది. అక్కడ ప్రవాస భారతీయులు నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతూ పోస్టర్లను ఏర్పాటు చేశారు. దీంతో సీషెల్స్ రాజధాని నగరం విక్టోరియాలో పండుగ వాతావరణం ఏర్పడింది. కాగా, 2015లో ప్రధాని మోదీ చివరిసారిగా సీషెల్స్‌లో పర్యటించారు. మళ్లీ 11 ఏళ్ల తర్వాత ఆ దేశ పర్యటనకు వెళ్లారు.

**విదేశాంగ శాఖ కీలక ప్రకటన**

సీషెల్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. ఇరు దేశాధినేతలు రక్షణ, సముద్ర భాగస్వామ్యంపై చర్చలు జరపనున్నట్లు తెలిపింది. ఈ పర్యటన సందర్భంగా భారత్–సీషెల్స్ పరస్పర సహకారాన్ని పూర్తి స్థాయిలో సమీక్షించడానికి, పరస్పరం ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకోవడానికి హెర్మినితో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని వెల్లడించింది. అలాగే ప్రధాని మోదీ సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొంది. ప్రవాస భారతీయులతో కూడా మాట్లాడుతారని స్పష్టం చేసింది.

# నిజమైన శివసైనికులు నాతోనే ఉన్నారు

శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు లోక్‌సభ సభ్యులు ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనలో చేరిన నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే స్పందించారు. కొందరు ఎంపీలు పార్టీని వీడినంత మాత్రాన శివసేన బలహీనపడదని, "నిజమైన శివసైనికులు నాతోనే ఉన్నారు" అని స్పష్టం చేశారు. పదవుల కోసం కొందరు పార్టీ మారినా, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, ప్రజల మద్దతు తమకే ఉందని అన్నారు. తిరుగుబాటు చేసిన ఎంపీల నియోజకవర్గాల్లో పర్యటించి పార్టీని మరింత బలోపేతం చేస్తానని ఉద్ధవ్ ఠాక్రే ప్రకటించారు. యవత్‌మాల్ పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ఉద్ధవ్ ఠాక్రే, తిరుగుబాటు చేసిన ఎంపీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "నిజమైన శివసైనికులు నాతోనే ఉన్నారు. మిగిలిన వారి ప్రవర్తనను ప్రజలంతా చూస్తున్నారు. అలాంటి వ్యక్తులు ఇంతకాలం మనతో కలిసి ఉండటం సిగ్గుగా అనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు. పదవులు, రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు పార్టీ మారినా, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు మాత్రం తమ వెంటే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసమే తమకు అతిపెద్ద బలమని ఉద్ధవ్ పేర్కొన్నారు. తిరుగుబాటు చేసిన ఎంపీల నియోజకవర్గాల్లో తాను స్వయంగా పర్యటించి పార్టీ కార్యకర్తలను కలుస్తానని వెల్లడించారు. అక్కడ పార్టీని మరింత బలోపేతం చేసే కార్యాచరణ చేపడతామని చెప్పారు. త్వరలో నాగ్‌పూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని నింపనున్నట్లు వెల్లడించారు.

**శివసేన ఎప్పుడూ అంతమవ్వదు**

ఇదిలా ఉండగా శివసేన (యూబీటీ) రాజ్యసభ సభ్యుడు



సంజయ్ రౌత్ కూడా తిరుగుబాటు ఎంపీలపై తీవ్ర విమర్శలు చేశారు. "శివసేన అంతమైపోదు. ఠాక్రేలు ఎప్పుడూ ముగిసిపోరు. బూడిదలో నుంచి మళ్లీ లేచి నిలబడతారు" అంటూ వ్యాఖ్యానించారు. పార్టీని వీడిన వారు శివసేనను బలహీనపరచలేరని, నిజమైన శివసైనికులు ఇప్పటికీ ఉద్ధవ్ ఠాక్రే వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. అంతే కాకుండా తిరుగుబాటు ఎంపీ సంజయ్ దేశ్‌ముఖ్‌ను లక్ష్యంగా చేసుకుని రౌత్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన రూ.50 కోట్లకు అమ్ముడుపోయారని ఆరోపించారు. "వ్యవసాయ మార్కెట్‌లో సరుకులకు విలువ లేదు. కానీ 15 రోజుల క్రితం ఇక్కడ రూ.50 కోట్లకు ఒక 'సరుకు' అమ్ముడుపోయింది. ఆయనే మీ ఎంపీ. ఆయన రాజకీయంగా ముగిసిపోయారు. ఇప్పుడు ఆయనకు తుది సంస్కారాలు చేసి ముందుకు సాగండి."

**ప్రజలే తగిన సమాధానం చెబుతారు**

శివసేన (యూబీటీ)తో తాము కొనసాగడం ఎవరికీ చేసిన ఉపకారం కాదని రౌత్ అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, బాలాసాహెబ్ ఠాక్రే ఆశయాలపై విశ్వాసంతోనే తాము విధేయంగా ఉన్నామని చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వం వల్లే కొందరు నేతలకు రాజకీయ విలువ వచ్చిందని, రానున్న ఎన్నికల్లో ప్రజలే వారికి తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. భారతీయ జనతా పార్టీపై కూడా రౌత్ విమర్శలు గుప్పించారు. అభివృద్ధి కోసమే పార్టీ మారామని తిరుగుబాటు నేతలు చెబుతున్నారని, అయితే 12 ఏళ్ల పాలనలో దేశంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రధాని నరేంద్ర మోదీ సొంత నియోజకవర్గమైన వారణాసిని చూస్తే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. అక్కడ ఇప్పటికీ రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల సమస్యలు ఉన్నాయని విమర్శించారు. ఇటీవల శివసేన (యూబీటీ)కి చెందిన పలువురు లోక్‌సభ సభ్యులు ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనలో చేరడంతో మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్ధవ్ ఠాక్రే, సంజయ్ రౌత్ వరుసగా స్పందిస్తూ పార్టీ కార్యకర్తల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నారు. తిరుగుబాట్లు వచ్చినా శివసేన (యూబీటీ) మరింత బలోపేతమవుతుందని, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతామని పార్టీ నాయకత్వం స్పష్టం చేస్తోంది.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు



రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేడు గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు. గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ–వీలర్లు, ఆటో–రిక్షాలు, ఫోర్–వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్, పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్–సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది" అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## వెలిగొండ ద్వారా ఈ సీజన్‌కే నీళ్లు ఇస్తాం

-మొదటిపేజీ తరువాయి

అభివద్ధి ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రాజెక్టుకు భూములివ్వడం అంటే త్యాగం చేసినట్టే. పూర్వీకుల నుంచి వచ్చిన భూములను ప్రాజెక్టు కోసం వదులుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు నాలుగు జిల్లాల తలరాతను మారుస్తుంది. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్యలు ఉన్నాయి.. దీంతో ఇక్కడి స్థానికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మార్కాపురం ప్రాంతం అంటే కరవు ప్రాంతమని పేరు... ఈ ప్రాంతానికి కృష్ణా నీళ్లు వస్తాయని ఎవ్వరూ అనుకోలేదు. మార్కాపురం ప్రాంతానికి కష్ణా నీళ్లిచ్చేందుకు ఎన్టీఆర్ 1985లోనే ఆలోచన చేశారు... దీని కోసం ఓ కమిటీని వేశారు. ఎన్టీఆర్ హయాంలోనే వెలిగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 1995లో ప్రకాశం జిల్లా పర్యటనకు ఎప్పుడు వచ్చినా వెలిగొండ ప్రాజెక్టు గురించే అడిగేవాళ్లు. వరద వస్తే.. ఆ జలాలను మళ్లిస్తే ఆ నీళ్లతో తాము జీవనం సాగిస్తామని ఇక్కడి రైతులు చెప్పేవారు. 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేశాం. వెలిగొండ ప్రాజెక్టుకు ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.10,580 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటి వరకు రూ.6,736 కోట్లు ఖర్చు చేశాం... ఇంకా రూ.3,844 కోట్లు ఖర్చు పెట్టాలి. రూ.1,932 కోట్లు తొలి విడతలో ఖర్చు పెట్టాలి... రూ.1906 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంది. 2024లో ప్రభుత్వం వచ్చాక రూ.759 కోట్లు ఖర్చు చేశాం... నిర్వాసితుల కోసం రూ.905 కోట్లు మంజూరు చేసి రూ.300 కోట్లు విడుదల చేశాం. ప్రస్తుతం బ్యాంకులకు శెలవులు ఉన్నందున మరో రెండు రోజుల్లో నిర్వాసితుల ఖాతాల్లో ఆర్ అండ్ ఆర్ డబ్బులు జమ అవుతాయి. ఆర్థికంగా ఇబ్బందులున్నాయి... అయినా వెలిగొండ సహా వివిధ ప్రాజెక్టులను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన రైతులు, నిర్వాసితుల జీవితాలు మెరుగ్గా ఉంటాయి. 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు జమ చేస్తున్నాం. కలనూతల, సుంకేశుల, చింతలముడిపి, బుడుంచెర్ల, కాటంరాజు తండా, సాయిరాం నగర్, మెట్టి గొంది, బసవాయిపల్లి, లక్ష్మీపురం, అక్కచెరువు, గొట్టిపాడు గ్రామాల నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ నిధులు ఇస్తున్నాం. మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు వద్దే ఉంటున్నారు. టన్నెల్లోకి వెళ్తున్నారు. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి... రాష్ట్రం విధ్వంసమైంది. శాంతి భద్రతలకు తీవ్రమైన విఘాతం కలిగించేలా వ్యవస్థలను నిర్వర్యం చేశారు. పరిశ్రమలను తరిమేశారు.. పెట్టుబడులు రాకుండా అడ్డుకున్నారు... అప్పుల భారాన్ని పెంచారు. గడచిన ప్రభుత్వం వెలిగొండ పనులు చేపట్టి ఉంటే నీళ్లు ఎప్పుడో వచ్చేవి. కూటమి ప్రభుత్వం వచ్చాకే పెద్ద ఎత్తున పనులు చేపట్టాం. గత పాలకులు వెలిగొండ ప్రాజెక్టు విషయంలో డ్రామాలాడారు.. మోసం చేశారు. మోసం చేయడంలో గొడ్డలి పార్టీ దిట్ట.. కళ్లార్పకుండా అబద్దాలు చెబుతారు... తేరుకునేలోపే మోసం చేసేస్తారు. మోసాలు ఎలా చేస్తారో.. ప్రజలను ఏ విధంగా ఏమారుస్తారోననే విషయంపై అవగాహన కల్పించేందుకు గొడ్డలి పార్టీ చర్యలను వివరిస్తూ మ్యూజియంలో పెట్టాలి. గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ శ్రీనివాసులు రెడ్డి సహా జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, నేతలు పాల్గొన్నారు.

## 'ఇది యువత భవిష్యత్తును దొంగిలించడమే'

మహారాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ప్రశ్నాపత్రం లీక్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని విద్యా వ్యవస్థను దోపిడీ వ్యవస్థగా మార్చేశారని ఆరోపించారు. ప్రశ్నాపత్రాల లీక్ వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. "మరోసారి ప్రశ్నపత్రం లీక్. మరో పరీక్ష రద్దు. ఈసారి, మహారాష్ట్ర ుజు పరీక్ష. దేశంలోని విద్యా పరీక్షల వ్యవస్థ ఒక దోపిడీ వ్యవస్థగా మారిపోయింది. దీనివల్ల దేశంలోని యువత అంతా అభద్రతాభావంలో పడిపోయారు. ఇది కేవలం ప్రశ్నపత్రం లీక్ మాత్రమే కాదు, ఇది యువత భవిష్యత్తును దొంగిలించడమే."

ఇదిలా ఉండగా, థానే జిల్లాలోని భివాండీ పట్టణంలో టెట్ పేపర్ లీక్ జరిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. టెట్ అసలు ప్రశ్నపత్రంలోని ప్రశ్నలను పోలి ఉన్న కొన్ని పత్రాలు కొందరి వద్ద ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆదివారం జరగాల్సిన ుజు–2026 పరీక్షను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి భివాండీ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అయితే, దిల్లీ నుంచి భివాండికి తీసుకువచ్చిన ుజు ప్రశ్నపత్రాల సెట్‌ను రూ.1.5 కోట్ల భారీ మొత్తానికి విక్రయించేందుకు ఒప్పందం జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

మరోవైపు, టెట్‌ను పూర్తి పారదర్శకతతో పరీక్షను నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎంఎస్?సీఈ) ఒక ప్రకటనలో పేర్కొంది.

## కేంద్ర మంత్రికి రూ.99 లక్షల సబ్సిడీ

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి వివాదంలో చిక్కుకున్నారు. తన సొంత మంత్రిత్వ శాఖ పరిధిలోని పథకం ద్వారా ఆయన ఏకంగా రూ.99.03 లక్షల సబ్సిడీని పొందడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిని కొత్త తరహా అవినీతిగా అభివర్ణిస్తూ విపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. రాజస్థాన్‌లోని పర్బత్‌సర్ తహసీల్ పీహ్ గ్రామంలో గల చౌదరి కుటుంబ వ్యవసాయ క్షేత్రంలో వాణిజ్యపరంగా దోసకాయల సాగు నిమిత్తం ఈ సబ్సిడీ మంజూరైంది. జాతీయ ఉద్యానవన బోర్డు ఈ ప్రాజెక్టుకు 2026 మార్చి 11న తుది ఆమోదం తెలిపింది. మార్చి 30న సబ్సిడీ మొత్తం ఆయన బ్యాంక్ ఖాతాలో జమ అయింది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే ఈ జాతీయ ఉద్యానవన బోర్డుకు భగీరథ్ చౌదరి ఎక్స్–అఫీషియో వైస్–ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తుండటమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. ఈ ఆరోపణలను మంత్రి భగీరథ్ చౌదరి తీవ్రంగా ఖండించారు. "నేను ఒక రైతును, చిన్నతనం నుంచే వ్యవసాయం చేస్తున్నాను. ఇందులో దాచాల్సింది ఏమీ లేదు. వేలాది మంది రైతులు పాలీహౌస్‌లు ఏర్పాటు చేసుకుని సబ్సిడీలు పొందుతున్నారు, నేను కూడా అదే నిబంధనల ప్రకారం పొందాను. దీనికోసం 2018లోనే దరఖాస్తు చేసుకున్నాను" అని ఆయన స్పష్టం చేశారు. తన ఫామ్‌లో తీసుకున్న రుణాలు, సబ్సిడీల వివరాలతో కూడిన బోర్డును అక్కడ ప్రదర్శిస్తున్నామని, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ కూడా ఇస్తున్నామని ఆయన వివరించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు దాడిని ఉద్ధృతం చేసింది. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ స్పందిస్తూ, "కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రిగా ఉండి, తన సొంత మంత్రిత్వ శాఖలోని పథకం కింద తన క్షేత్రానికే కోటి రూపాయల సబ్సిడీ మంజూరు చేయించుకోవడాన్ని ఏమనాలి?" అని ప్రశ్నించారు. ఇది మోదీ ప్రభుత్వంలో అవినీతికి నిదర్శనమని ఆయన విమర్శించారు. 'మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్' కింద వాణిజ్య ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ సబ్సిడీలు అందిస్తోంది. అయితే, మంత్రి నేరుగా పర్యవేక్షించే కమిటీ కాకుండా, మరో ప్రాజెక్ట్ ఆమోద కమిటీ ఈ సబ్సిడీకి అనుమతి ఇచ్చిందని రికార్డులు వెల్లడిస్తున్నాయి.

## రీసెర్చ్ పేపర్ల ఉపసంహరణ

అంతర్జాతీయ పరిశోధన రంగంలో అగ్రగామిగా ఎదగాలని ఆకాంక్షిస్తున్న భారత్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. పరిశోధన పత్రాల ఉపసంహరణ (రిట్రాక్షన్)లో అంతర్జాతీయ స్థాయిలో మన దేశం రెండో స్థానంలో నిలవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2025 సంవత్సరానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో పరిశోధన పత్రాలను వెనక్కి తీసుకున్న తొలి పది విశ్వవిద్యాలయాల జాబితాలో ఏకంగా ఆరు భారతీయ వర్సిటీలు ఉండటం గమనార్హం. ఈ వివరాలను 'రిట్రాక్షన్ వాచ్' డేటాబేస్ వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, 2025లో చైనా 1,701 పరిశోధన పత్రాల ఉపసంహరణతో ప్రథమ స్థానంలో ఉండగా, భారత్ 887 రిట్రాక్షన్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనల్లో మన దేశం వాటా కేవలం 5 శాతమే అయినప్పటికీ, ఉపసంహరణల్లో మాత్రం 21 శాతం వాటాను కలిగి ఉండటం పరిశోధనల నాణ్యతా ప్రమాణాలపై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ జాబితాలో చెన్నైలోని అన్నా యూనివర్సిటీ 161 రిట్రాక్షన్లతో అంతర్జాతీయంగా మొదటి స్థానంలో నిలిచింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం టెక్నికల్ యూనివర్సిటీ (160), సవీత ఇన్‌స్టిట్యూట్ (159) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ 104 రిట్రాక్షన్లతో ఐదో స్థానంలో నిలవగా, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ 98 ఉపసంహరణలతో ఆరో స్థానంలో నిలిచింది. నాణ్యత ప్రమాణాలను విస్మరించి పరిశోధన పత్రాలను ప్రచురించడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. పరిశోధనలో లోపాలు,

# అనంత యువకుడికి లండన్ లో అరుదైన గౌరవం

## - గొర్తి ఉదయ్ కిరణ్ కు బ్రిటన్ పార్లమెంట్ లో ఘనసత్కారం





**అంకుశం న్యూస్ అనంతపురము, జూన్ 27 :** నగరానికి చెందిన యువ పరిశోధకుడు, సామాజిక అధ్యయనశీలి గొర్తి ఉదయ్ కిరణ్ కు లండన్ లో అరుదైన గౌరవం దక్కింది. ఈ వేడుకలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) సంస్థ సిఈఓ సంతోష్ శుక్లా, రాజేష్ శుక్ల, బ్రిటన్ పార్లమెంటు సభ్యులు గరేత్ బకాన్, వీరేంద్ర శర్మ, మిస్ ఇంగ్లాండ్ లిమిటెడ్ డైరెక్టర్ యాంజీ బిస్లె తదితరులు అవార్డును అందజేశారు. "గ్రామీణ యువతపై సోషల్ మీడియా ప్రభావం : ఒక అధ్యయనం" అనే అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనా పత్రానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ సభా మందిరంలో ఉదయ్ కిరణ్ ను ఘనంగా సత్కరించారు. ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ నల్లాని రాజేశ్వరి, ప్రభుత్వ హెడ్మాష్టర్ గొర్తి వెంకటస్వామి దంపతుల కుమారుడైన ఉదయ్ కిరణ్ ను ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. తిరుపతి లోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., సోషియాలజీ పూర్తి చేసిన ఉదయ్ కిరణ్ ప్రస్తుతం పోటీపరీక్షలకు సిద్ధమవుతున్నారు. అనంతపురం రామ్ నగర్ లోని ఉదయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఐదవ తరగతి వరకు ప్రాథమికవిద్య నభ్యసించారు. ఇక్కడ జాతీయ రహదారి లోని శ్రీ చైతన్య పాఠశాలలో 6, 7 తరగతులు పూర్తి చేశారు. బెంగళూరు వద్ద ఆకాష్ ఇంటర్నేషనల్ స్కూల్లో 9 నుంచి 12 వ తరగతి వరకూ సిబిఎస్ఈ సిలబస్ లో మంచి ఫలితాలు సాధించారు. హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతూ, కెపి 21 వ సెంచరీ ఐఏఎస్ అకాడమీలో యూపీఎస్సీ పరీక్షలకు ప్రాథమిక శిక్షణ పొందారు. బి.ఏ., (ఈపిపి) పూర్తిచేశాక, ఢిల్లీలోని ప్రముఖ శిక్షణా సంస్థ నుంచి ఆన్లైన్ ద్వారా తర్ఫీదు పొందుతున్నారు. అంతర్జాతీయంగా సింగపూర్, దుబాయ్, బ్రిటన్ వంటి దేశాలను సందర్శించారు. దేశంలో ప్రసిద్ధి పొందిన విద్యావేత్తలు, సామాజికవేత్తలను వ్యక్తిగతంగా కలిసి పలు అంశాలపై చర్చించి మంచి అవగాహనను పెంచుకున్నారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థలు రాస్, పాస్, ఆర్.డి.టి. ల కార్యక్రమాలను ప్రత్యేకంగా పరిశీలించారు. వారు నిర్వహిస్తున్న అనాథల, అంధుల, వృద్ధుల ఆశ్రమాలను తరచూ సందర్శించారు. ఎస్వీ యూనివర్సిటీలో ఎం.ఏ., (సోషియాలజీ) చదివే కాలంలో ప్రాజెక్టు వర్క్ గా చేసిన అంశం మీద ఆసక్తితో మరింత లోతుగా అధ్యయనం సాగించారు. రాయలసీమ జిల్లాల్లోని పలు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి, అక్కడి యువత మీద సామాజిక మాధ్యమాల ప్రభావం గురించి ప్రత్యేక అధ్యయనం చేశారు. నగరాలతో పాటు గ్రామాలను కూడా సోషల్ మీడియా బాగా ఆకర్షించినట్లు గమనించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై కూడా ప్రత్యేక అధ్యాయాల్లో లోతుగా చర్చించారు. ఫలితాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసిన ఉదయ్ కిరణ్ తనదైన శైలిలో విశ్లేషించారు. మెంటార్ చంద్రశేఖర్, తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో తన పరిశోధనా పత్రాలను "వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" (లండన్) వారి దృష్టికి తీసుకెళ్లారు. సామాజిక అంశాల పట్ల ఇతనికున్న ఆసక్తి, అవగాహనను గుర్తించిన ఆ సంస్థ సిఈఓ సంతోష్ శుక్లా ప్రత్యేకంగా లండన్ కు ఆహ్వానించారు. సాక్షాత్తూ బ్రిటన్ పార్లమెంట్ లోని సభామందిరంలో ఘనంగా సత్కరించారు. అక్కడి పార్లమెంట్ సభ్యుల డైనింగ్ హాల్ లోనే బ్రిటిష్ అధికారులు, ఎంపి లతో కలిసి గౌరవంగా విందును కూడా ఏర్పాటు చేశారు. బ్రిటన్ పార్లమెంట్ ను సందర్శించే అరుదైన అవకాశం తనకు రావడం పట్ల సామాజిక పరిశోధక విద్యార్థి గొర్తి ఉదయ్ కిరణ్ ఆనందం వ్యక్తం చేశారు. భారతదేశంలో గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక సాధికారత కోసం భవిష్యత్తులో తన వంతు కృషి సాగిస్తానని ఉదయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఇది గొప్ప మైలురాయి : సిఈఓ**

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తన 10వ సమ్మిట్ - అంతర్జాతీయ అవార్డుల ప్రదానోత్సవం యూకే పార్లమెంట్‌లోని ప్రతిష్టాత్మకమైన హౌస్ ఆఫ్ కామన్స్, ప్యాలెస్ ఆఫ్ వెస్ట్‌మిన్‌స్టర్‌లో ఘనంగా జరిగిందని అధికారికంగా ప్రకటించింది. ఈ వేడుక సంస్థ చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన సమావేశాలలో ఒకటిగా నిలవనుంది. ఈ విశిష్టమైన వేడుక, యూకే (యునైటెడ్ కింగ్‌డమ్), యూఎస్ఏ (యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా), రష్యా, ఫ్రాన్స్, ఇటలీ, ఇండియా, నేపాల్, కజకిస్తాన్, కెనడా, మెక్సికో, పోర్చుగల్, స్పెయిన్, స్విట్జర్లాండ్, బెల్జియం, జర్మనీ, ఈజిప్ట్, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, పోలాండ్, జపాన్, ఆస్ట్రేలియా, మారిషస్ దేశాల నుండి వచ్చిన అత్యుత్తమ వ్యక్తులు, సంస్థలను సత్కరించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ప్రజా సేవ, దౌత్యం, వ్యాపార రంగాలలో రాణించిన వారిని కీర్తించింది.

ఈ వేడుకలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) సంస్థ సిఈఓ సంతోష్ శుక్లా, రాజేష్ శుక్ల, బ్రిటన్ పార్లమెంటు సభ్యులు గరేత్ బకాన్, వీరేంద్ర శర్మ, మిస్ ఇంగ్లాండ్ లిమిటెడ్ డైరెక్టర్ యాంజీ బిస్లె తదితరులు అవార్డును అందజేశారు. ప్రపంచ ప్రముఖులు, క్యాబినెట్ మంత్రులు, దౌత్యవేత్తలు, విధాన రూపకర్తలు, అంతర్జాతీయ వ్యాపార నాయకులు వంటి ఉన్నత స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. విభిన్న దేశాలు, రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్న ఈ వేడుక, అర్థవంతమైన చర్చలను ప్రోత్సహించి, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేస్తుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు.

ప్రపంచ ఐక్యత, గుర్తింపు, పురోగతిని ప్రోత్సహించడంలో ఈ వేడుకల ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈఓ సంతోష్ శుక్లా సభలో ప్రకటన చేశారు. ఈ వేడుక శ్రేష్ఠతను గౌరవించడమే కాకుండా, ప్రపంచ పరివర్తన దిశగా సామూహిక బాధ్యతను ప్రేరేపిస్తుందని ఆయన పేర్కొన్నారు. దాని అంతర్జాతీయ ప్రభావం, ఉన్నత స్థాయి భాగస్వామ్యంతో, 10వ సమ్మిట్ - అవార్డుల ప్రదానోత్సవం యూకే పార్లమెంట్ నడిబొడ్డున ఒక మైలురాయి సమావేశంగా నిలుస్తుందని వాగ్దానం చేశారు.

# ధర్మవరంప్రతి ఫిర్యాదును పీజీఆర్ఎస్ కు అందజేస్తున్నాం

- సర్ పై నియోజకవర్గ ముఖ్య నాయకులతో మాట్లాడిన శ్రీరామ్






**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 27:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని పరిటాల శ్రీరామ్ తెలియజేశారు. ధర్మవరం పట్టణం ఎర్రగుంట సర్కిల్లో గల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ ప్రజా దర్బార్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణం మరియు రూరల్ లో గల ప్రజలు పలు సమస్యలపై పరిటాల శ్రీరామ్ కు అర్జీలు అందజేశారు. ఫిర్యాదు దారుల సమస్యలను విన్న పరిటాల శ్రీరామ్ ప్రతి సమస్యకు జవాబుదారితనంగా తెలుగుదేశంపార్టీ ఉంటుందని మీరు ఇచ్చిన ప్రతి సమస్యను పీజీ ఆర్ఎస్ ద్వారా ఆన్లైన్లో ప్రభుత్వానికి అందజేస్తున్నామని ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని పరిటాల శ్రీరామ్ ఫిర్యాదుదారులకు తెలియజేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో గల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో పరిటాల శ్రీరామ్ సర్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)కార్యక్రమం జరుగుతున్న తీరుపై పట్టణ,మండలాల వారీగా తెదేపా నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులకు పరిటాల శ్రీరామ్ ప్రత్యేక సూచనలు చేశారు పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ సర్ పై నిర్లక్ష్యం వీడి, పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు,పార్టీముఖ్య నాయకులు సర్ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని అర్హులైన ఏ ఒక్కరి ఓటు ఓటరు జాబితా నుండి తొలగించకుండా చూడాలని సర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రాతిష్టాత్మకంగా తీసుకొని ముందుకెళ్లాలని ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ పార్టీ నాయకులకు తెలియజేశారు. ధర్మవరం నియోజకవర్గంలో ఓటరు మ్యాపింగ్ డిజిటలైజేషన్ లో ధర్మవరం నియోజకవర్గం పూర్తిస్థాయిలో వెనుకబడి ఉందని బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యేటట్లు చూడాలని పరిటాల శ్రీరామ్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు

# రాష్ట్రంలో చంద్రబాబు, నారా లోకేష్ డైరెక్షన్‌లోనే అరాచకాలు

-- ఇప్పటి వరకు భూములిచ్చిన రైతులకు ఏం న్యాయం జరిగింది?

-- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి




**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 27 :** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు అరాచకాలకు పాల్పడుతున్నారని రాజధాని పేరుతో అమరావతిలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. రాజధానికి భూములు ఇవ్వని రైతులపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని, చివరకు రైతుల భూముల్లోకి నీళ్లు వదులుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం రైతులు, రైతు పరిరక్షణ కమిటీ నేతలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బృందం వెళితే ఉండవల్లిలో టీడీపీ మూకలు దాడులకు పాల్పడ్డాయని తెలిపారు. ఇటీవల రాజధాని ప్రాంతంలోని రైతులు వైఎస్ జగన్‌ను కలిసి తమ సమస్యలు తెలియజేసి న్యాయసాయం చేయాలని కోరితే రైతు పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుల ఆహ్వానం మేరకు శనివారం పొలాలను పరిశీలించేందుకు వెళితే టీడీపీ గూండాలు రాళ్లు, కర్రలతో దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. రైతుల హక్కుల కోసం పోరాడుతున్న వారిపై పోలీసుల సమక్షంలోనే దాడులు చేయడం దుర్మార్గమని తెలిపారు. రాజధాని పేరుతో భూములు తీసుకున్న రైతులకు న్యాయం చేయాలన్నారు. అమరావతిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు బాహ్యప్రపంచానికి తెలియకుండా చేయడమే లక్ష్యంగా టీడీపీ మూకలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇదంతా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ డైరెక్షన్‌లోనే జరుగుతోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రశ్నించే గొంతులను నొక్కడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. రాజధాని ప్రాంతంలో అన్యాయానికి గురవుతున్న రైతులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## అదేం టెక్నికో.. తలపై రుమాలు.. చెవిలో ఫోన్: ఆ రైతు ఐడియాకు ఫిదా!



**రాప్తాడు అంకుశం న్యూస్ జూన్ 28:** మండల కేంద్రంలోని రాప్తాడు తహశీల్దార్ కార్యాలయం సమీపంలో శనివారం కనిపించిన ఒక దృశ్యం కాసేపు అందరినీ ఆశ్చర్యపరిచింది. తన పని నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ఒక రైతు, కాసేపు విశ్రాంతి కోసం టీ స్టాల్ వద్ద కూర్చుని టీ తాగుతూ సిగరెట్ కాలుస్తుండగా, ఫోన్‌ను చేత్తో పట్టుకోకుండా ఏకంగా తలకు ఉన్న రుమాలు లోపల ఫోన్‌ను దోపుకుని మాట్లాడుతున్న వైనం చూపరులను ఆశ్చర్యపరిచింది. చేతులు ఖాళీగా ఉంచుకుంటూ, ఏకాగ్రతతో ఫోన్ సంభాషణలో మునిగిపోయిన ఆయన తీరు చూస్తుంటే, "ఇలా కూడా ఫోన్ వాడుకోవచ్చా!" అని ఎవరికైనా అనిపించక మానదు. చేతికి శ్రమను తగ్గించుకునేలా టెక్నాలజీని వాడుకోవడంలో ఆ రైతు చూపిన ఈ వినూత్న 'హ్యాండ్స్-ఫ్రీ' పద్ధతి ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఏది ఏమైనా, టెక్నాలజీని తమకు నచ్చినట్లుగా వాడుకోవడంలో రైతుకున్న తెలివితేటలు కొత్తగా ఉన్నాయని పలువురు కొనియాడుతుంటే, ఈ వినూత్న దృశ్యాన్ని అంకుశం ప్రతినిధి శీన తన కెమెరాలో బంధించారు.

## ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్టమైన భద్రత

- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

- : ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..





**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 27 :** ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని, సి సి కెమెరాల పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం ఉదయం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాగ్ బుక్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ల వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్ కుమార్, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సామ్యూల్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ లో బీఎల్ఏలే చాలా కీలకం.. నిర్లక్ష్యంగా ఉండదు

- ఎమ్మెల్యే పరిటాల సునీత

- రామగిరి మండల నాయకులకు ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం





**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 27:** రాప్తాడు నియోజకవర్గం లో ప్రతి గ్రామంలోస్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) లో బూత్ లెవల్ ఏజెంట్లదే కీలకమని.. వారు ప్రతి ఇంటికి వెళ్లేలా నాయకులు చూడాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ అతిథి గృహంలో మండల నాయకులతో ఎస్ఐఆర్ పై సమావేశం నిర్వహించారు. బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే పరిస్థితులు, ఓటరు ధృవీకరణ విధానం, కుటుంబ లింకేజీలు, డ్రాఫ్ట్ జాబితా పరిశీలన, అభ్యంతరాల ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. ఇప్పటి వరకు బీఎల్ఏ లు ఎంత వరకు డోర్ టూ డోర్ పూర్తి చేశారన్నది ఆరా తీశారు. కొన్ని చోట్ల ఇంకా కొందరు ఈ ప్రక్రియను వేగవంతం చేయకపోవడాన్ని ప్రస్తావించారు. మండల నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు ఈ విషయంపై చొరవ తీసుకోవాలన్నారు. ఈనెల 15వ తేది నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారన్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని.. జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే భవిష్యత్ లో మనకు నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండాలని.. అనర్హులకు తావు లేకుండా చూడాలన్నారు..

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భరత్ నరసింహ కుటుంబాన్ని పరామర్శించిన కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్



**అంకుశం న్యూస్, కదిరి,జూన్:27:** తలుపుల మండల పరిధిలోని ఉడమలకుర్తి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన భరత్ నరసింహ (23) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఫార్చునర్ కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం తెలుసుకున్న కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కి వెళ్ళి భరత్ పార్థివ దేహాన్ని సందర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకోని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యంగ వుండాలని ఇలాంటి సంఘటన జరగటం చాలా బాధకరం ఇలాంటి క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి ఆ దేవుడు మనోధైర్యం ఇవ్వాలని,నివాళులు అర్పించిన కదిరి నియోజకవర్గం శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్. ఎమ్మెల్యేతో పాటు టిడిపి,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జవీ చంద్రబాబు గారి చిత్రపటానికి పాలాభిషేకం



**అంకుశం న్యూస్,అనంతపురం,జూన్ 27 :** నేడు ప్రజావేదిక నందు రాష్ట్ర ప్రభుత్వం 2004 కంటే ముందు ఉద్యోగాలు పొందిన వారికి నేడు రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానం అమలు చేసినందుకు గాను స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారికి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారికి కృతజ్ఞత సభను ఉపాధ్యాయులు ఏర్పాటు చెసారు..అక్కడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి చిత్రపటానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు పార్టీ పరిశీలకులు రామకృష్ణ గారు ఉపాధ్యాయులు పాలాభిషేకం చేసి కేక్ కట్ చేయడం జరిగింది..అనంతరం ఎమ్మెల్యే గారిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు..

# గూగూడు, పరిసరాలలో డ్రోన్ల ద్వారా నిఘా

**- అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు**

**- జిల్లా ఎస్పీ పి జగదీష్**

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం జూన్ 27:** అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం లోనినార్పల మండలం ?గూగూడు కుళ్ళాయిస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడమే ధ్యేయంగా పోలీస్ శాఖ పని చేస్తుందని అన్ని డిపార్ట్మెంట్ లతో సమన్వయం చేసుకుంటూ శాంతి భద్రతలు పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్నామనిలిజిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ తెలిపారులి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేదని ఇందుకోసం ప్రత్యేకంగా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రశాంతంగా ప్రజలు మొహరం వేడుకలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని ఎస్పీ జగదీష్ తెలిపారుఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం ముందస్తుగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. క్షేత్ర పరిధిలో భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అంతే కాకుండా... గూగూడు, పరిసర ప్రాంతాలలో డ్రోన్లు ఎగురవేశారు. ?భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. ఉత్సవ ప్రాంగణాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు, గ్రామ పరిసరాలు మరియు ప్రధాన రహదారులపై డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచారు. క్షేత్రంలోని ప్రతి కదలికను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక పోలీస్ కంట్రోల్ రూమ్ నుండి సిబ్బంది 24/7 నిశితంగా పరిశీలిస్తున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూ లైన్లను క్రమబద్ధీకరిస్తూ, ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఉత్సవాల వేళ భక్తులు తమ విలువైన నగలు, పర్సులు మరియు మొబైల్ ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ జగదీష్ సూచించారు





# అంగవైకల్యం లేని రేపటి భారతం కోసం పోలియో చుక్కలు

**రాప్తాడు, అంకుశం న్యూస్ జూన్ 28:** పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించి, అంగవైకల్యం లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి, డాక్టర్ శివకృష్ణ తెలిపారు. ఆదివారం రాప్తాడు మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామన్నారు. ఈసందర్భంగా శనివారం గ్రామ వీధుల్లో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. మండల పరిధిలో మొత్తం 4,275 మంది చిన్నారులకు టీకాలు వేయాలని అధికారులు పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేశామని... ఇందుకోసం 35 పోలియో బూతులు, ఒక మొబైల్ టీమ్, ఒక ట్రాన్సిట్ టీమ్ మరియు పర్యవేక్షణ కోసం మూడు ప్రత్యేక సూపర్ వైజర్ రూట్లను అధికారులు ఏర్పాటు చేశామన్నారు. ?ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించామన్నారు. పోలియో నినాదాలతో సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు వీధుల వెంట ర్యాలీగా వెళ్తూ ప్రజలను చైతన్యపరిచారు. ఈ పోలియో డ్రైవ్‌లో భాగంగా మొదటి రోజు బూతుల వద్ద టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత తదుపరి రెండు, మూడు రోజులలో ప్రత్యేక టీమ్స్ ఇంటింటికీ తిరిగి, మొదటి రోజు చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి వారికి టీకాలు వేస్తామన్నారు. ముందు జాగ్రత్తగా తల్లిదండ్రులందరూ రేపు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో




సీహెచ్ఓ శివప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓలు అచ్యుత్, అశోక్, సూపర్ వైజర్లు నరసింహ, లక్ష్మీనరసమ్మ, ఎల్.టి శ్రీధర్ బాబు, ఫార్మసీ ఆఫీసర్ మూర్తి, ఎంఎల్ హెచ్ పి లక్ష్మి, ఎంపీహెచ్ఏ నారాయణ స్వామి, ఏఎన్ఎం రామాంజినమ్మ, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయండి.

**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి జూన్ 27:** శ్రీ సత్య సాయి జిల్లాలో ఎక్సైజ్ పోలీస్ శాఖ సమన్వయంతో జిల్లాలో ఎక్కడ గంజాయి డ్రగ్స్ లాంటివి ఉండడానికి వీల్లేదని వాటి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఎస్పీ సతీష్ కుమార్ అధికారులకు ఆదేశించారుశనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు శ్రీ సత్యసాయి జిల్లాను మాదక ద్రవ్యాల రహిత (Drug-Free) జిల్లాగా మార్చడమే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. నార్కోటిక్స్ కో-ఆర్డినేషన్ సెంటర్ (N.CORD) కమిటీ సమీక్షా సమావేశం అత్యంత కీలకమైన అజెండాతో నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ గారితో పాటు జిల్లా ఎస్.పి సతీష్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొని, జిల్లాలో నార్కోటిక్ డ్రగ్స్, గంజాయి మరియు ఇతర నిషేధిత మత్తు పదార్థాల రవాణా, విక్రయాల అరి కట్టడానికి తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ, యువత భవిష్యత్తును రూపుమాపుతున్న మత్తు సంస్కృతిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. కేవలం సంప్రదాయ తనిఖీలకే పరిమితం కాకుండా, ప్రస్తుత కాలానికి అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని (Advanced Technology) నిఘా వ్యవస్థలో భాగం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో గంజాయి, చీణూా (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) డ్రగ్స్ యొక్క మూలాలను, వాటి సరఫరా గొలుసును (Supply Chain) సాంకేతిక ఆధారాలతో గుర్తించి పూర్తిగా నిర్మూలించాలని ఆదేశించారు.గతంలో జిల్లాలో నమోదైన గంజాయి మరియు డ్రగ్స్ కేసుల్లోని నిందితులు, రవాణాదారులు మరియు మధ్యవర్తుల ప్రస్తుత కదలికలపై పోలీసు, ఎక్సైజ్ శాఖలు నిరంతరం నిఘా (Surveillance) ఉంచాలి. వారు మళ్లీ పాత నేరాల బాట పట్టకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలి. శ్రీ సత్యసాయి జిల్లా భౌగోళిక సరిహద్దులను పరిగణనలోకి తీసుకుని, ఇతర ప్రాంతాల నుండి జిల్లాలోకి మాదక ద్రవ్యాలు చొరబడకుండా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘాను రెట్టింపు చేయాలి. కళాశాలలు, పాఠశాలల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలని, యువత మరియు విద్యార్థులు ఈ రొంపిలో పడకుండా విద్యాశాఖ సహకారంతో అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో ప్రసాద్ అసిస్టెంట్ కమిషనర్, గోవింద నాయక్ డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఒ ఎక్సైజ్ ఆఫీసర్, నరసింహులు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ,చీ.జూ=ణ కమిటీ సభ్యులు మరియు జిల్లాలోని వివిధ సబ్-డివిజన్ల పోలీస్ ఇన్స్పెక్టర్లు తధితరులు పాల్గొన్నారు.






# రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 27:** అనంతపురం జిల్లా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎవరైనా డీలర్లురేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని.. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. తన క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. నాలుగు పంచాయతీల్లో ఉన్న సమస్యల గురించి చర్చించారు. ప్రస్తుతం తాగునీరు ఎంత మేర సరఫరా అవుతోంది.. ఎక్కడైనా సమస్య ఉందా అని ఆరా తీశారు. అలాగే డ్రైనేజీ సమస్యల గురించి ఆరా తీశారు. త్వరితగతిన చేపట్టాల్సిన వాటిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే తాగునీటి సమస్య ఎక్కడా లేకుండా చూసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ కింద చేపడుతున్న పనులు పురోగతి కూడా చర్చించారు. ఆ పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్, డీఈలతో సమావేశం నిర్వహించారు. అనంతపురం డిపోకు కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులు వచ్చిన నేపథ్యంలో వాటిని ఎక్కడ వినియోగించాలన్నది చర్చించారు. అనంతపురం డిపోకి కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను ఇక్కడే వినియోగించాలని.. ప్రయాణికుల అవసరం కూడా ఎక్కువగా ఉందన్నారు. వీటితో పాటు పాత బస్సులను కూడా ఎక్కడిక్కడే ఉండేలా వేరే డిపోలకు పంపించకుండా యధావిధంగా ఉంచాలని ఆదేశించారు. స్త్రీ శక్తి పథకం అమలవుతున్న నేపథ్యంలో కొత్త బస్సుల అవసరం ఎక్కువగా ఉందన్నారు. జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి.. బస్సులను అవసరం ఎక్కువగా ఉంటుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక స్టాండ్ ఏర్పాటు గురించి కూడా చర్చించారు. మరోవైపు పౌరసరఫరాల శాఖ అధికారులతో కూడా ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న రేషన్ పంపిణీ గురించి చర్చించారు. 60ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరఫరా చేయాలన్నారు. దీని పై ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రేషన్ బియ్యం తూకాలు కూడా కచ్చితంగా ఉండాలని.. ఎవరైనా బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ఎలాంటి రాజీ పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.



## శ్రీ వెంకటేశ్వర స్వామి నైవేద్య కార్యక్రమంలో పాల్గొన్న పెండ్యాల, దారపనేని

**కనిగిరి జూన్ 27 అంకుశం న్యూస్:** నెల్లూరు జిల్లా వైకుంఠపురం లో వెలసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ప్రదోష వ్రతం సందర్భాన్ని పురస్కరించుకుని స్వామివారికి దేవస్థానం ప్రధాన అర్చకులు నైవేద్య కార్యక్రమం నిర్వహించారు. ఈ నైవేద్య కార్యక్రమంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్వాహకులు పెండ్యాల సూర్యనారాయణలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అర్చకులు స్వామివారి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను పెండ్యాల సూర్యనారాయణ, దారపనేని చంద్రశేఖర్ లకు అందజేశారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ వైకుంఠపురం లో వెలసి ఉన్న వెంకటేశ్వర స్వామి దర్శనంతో భోగభాగ్యాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తులకు అపారమైన నమ్మకం అని, తిరుమల వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈ ప్రాంతంలో నిర్మించి భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించిన పెండ్యాల సూర్యనారాయణ ను దారపనేని చంద్రశేఖర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మోపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోరు బోయిన గిడ్డయ్య యాదవ్ భక్తులు పాల్గొన్నారు.ఖ



## గొల్లల మామిడాడలో శ్రీ సూర్యనారాయణ మూర్తి 124 వార్షిక కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

**అంకుశం న్యూస్ కాకినాడ జిల్లా జూన్ 27:** పెదపూడి మండలం గొల్లల మామిడాడలో శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం 124 వార్షిక కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్ని,స్వామి దర్శించుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప,అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరశీ,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి,కూడా చైర్మన్ తలాటం సత్య,అనపర్తి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ మర్రెడ్డి శ్రీనివాసరావు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం కూటమి నాయకులు,కార్యకర్తలు,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## శ్రీధర్ ఆప్టిక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి, మాజీఎమ్మెల్యే సత్తి





**అంకుశం న్యూస్ తూర్పుగోదావరి జిల్లా జూన్ 27:** అనపర్తి మండలం అనపర్తి గ్రామంలో ద్వారంపూడి శ్రీధర్ రెడ్డి శ్రీమతి శ్రీదేవి దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీధర్ ఆప్టిక్స్ వ్యాపార ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నారాయణ రెడ్డి కంటి ఆసుపత్రి ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణ రెడ్డి మరియు అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, యువ నేత్ర వైద్యులు తేతలినారాయణ రెడ్డి, ప్రముఖ సుగర్ వైద్యనిపుణులు డాక్టర్ రామగురెడ్డి,ప్రముఖ వ్యాపారవేత్తలు అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత అమ్మిరెడ్డి,మేడపాటి చెల్లారెడ్డి, నల్లమిల్లి సాయిరామారెడ్డి (హీరోహోండాసాయి), వెంకట పద్మావతి బిల్లింగ్ మార్ట్ సూర్య , విజయసాయి ఎంపోరియం వెలగల రామకృష్ణారెడ్డి, మాణిక్యాంబ చంటిబాబు, సీనియర్ పాత్రికేయుడు చింతా వీర్రాఘవరెడ్డి,మరికొందరు వ్యాపారవేత్తలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## గూగూడు కుళ్లాయి స్వామి వారిని దర్శించుకున్న పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,





**అంకుశం న్యూస్, అనంతపురం, జూన్ : 27:** శింగనమల నియోజకవర్గం, నార్పల మండలం, గూగూడు గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ కుళ్లాయిస్వామి, శ్రీ ఆంజనేయస్వామి జంట దేవాలయాల మొహరం బ్రహ్మోత్సవాల్లో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ గారు, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు గారు మరియు వారి సతీమణి గారు, జిల్లా తెలుగు దేశం పార్టీ నాయకులు ఆలం వెంకట నరసా నాయుడు గారు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, స్థానికులతో కలిసి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారు. శ్రీ కుళ్లాయిస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వారి కరుణాకటాక్షాలు శింగనమల నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సమృద్ధి నెలకొనాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు.

## పద్మశ్రీ అవార్డు అందుకున్న మురళీ మోహన్ ను సత్కరించిన డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి

**అంకుశం న్యూస్ తూర్పుగోదావరి జిల్లా జూన్ 27:** సినీరంగంలో చేసిన సేవలకు గాను రాజమహేంద్రవరం పార్లమెంట్ మాజీ సభ్యులు, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ పూర్వపు అధ్యక్షులు మాగంటి మురళీమోహన్ కు రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ప్రముఖ దర్శకుడు, హీరో ఎస్వీ కృష్ణారెడ్డి, సినీ నిర్మాత కొవ్వూరి అచ్చిరెడ్డి, సినీ రంగానికి చెందిన మేడపాటి శ్రీనివాస రెడ్డి, లు మర్యాదపూర్వకంగా కలిసి సాలువ కప్పి పుష్పమాలవేసి ఘనంగా సత్కరించారు, ఈ సందర్భంగా ఎస్వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాజమండ్రి పార్లమెంట్ సభ్యునిగా అనపర్తి ప్రాంతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు గుర్తుండిపోయేలా మురళి మోహన్ నిస్వార్ధ ప్రజా సేవలందించి గోదావరి జిల్లా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు, సామాజిక,రాజకీయ,సినీ రంగాలలో మురళీమోహన్ అందించిన సేవలు స్ఫూర్తిదాయంగా నిలిచాయని కొనియాడారు, పద్మశ్రీ పురస్కార గ్రహీత మురళి మోహన్ ను ఆదర్శ మిత్రమండలి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కొవ్వూరి ధర్మారెడ్డి, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు సత్తి శ్రీనివాసరెడ్డి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

